సాక్షి

అనంతపురం

శుక్రవారం | 23 | జూన్ | 2023



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 834 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నేత్రానందం.. నృత్యోత్సవం

అనంతపురం టీటీడీ కల్యాణమండపంలో గురువారం నృత్యోత్సవం నేత్రానందంగా సాగింది. పలు రాష్ట్రాల కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.7°/ 23.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

శ్రీవారి అంగ ప్రదక్షిణం టోకెన్ల విడుదల నేడు



అనంతపురం కల్చరల్: సెప్టెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు టీటీడీ ప్రతినిధి పండిట్ వేణు ఓ ప్రకటనలో తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోటా మధ్యాహ్నం 3 గంటలకు విడుదల వుతుందని పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విస్తరిస్తోన్న నైరుతి

- 16 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: 'నైరుతి' ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 16 మండలాల పరిధిలో 1.9 మి.మీ సగటు నమోదైంది. అత్యధికంగా యాడికి మండలంలో 14 మి.మీ వర్షపాతం నమోదైంది. పుట్లూరు, గుత్తి, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, గుంతకల్లు, నార్పల, గార్లదిన్నె, బొమ్మనహాళ్, విడపనకల్లు, పెద్దపప్పూరు, పామిడి, వజ్రకరూరు, బుక్కరాయసముద్రం, అనంతపురం తదితర మండలాల్లో తేలికపాటి వర్షంపడింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా, ప్రస్తుతానికి 38.4 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు



అనంతపురం కల్చరల్: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తిరుపతిలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో చేరేవారికి ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో 4 నెలల శిక్షణ ఇస్తారన్నారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్స్ చేసేవారికి దేశ విదేశాల్లో 6 నెలలు ప్రముఖ హోటళ్లలో శిక్షణ ఉంటుందన్నారు. సర్టిఫికెట్ కోర్సు ద్వారా ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జులై 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9700440604, 9701343846 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ నేడు

రాప్తాడురూరల్: 1998, 2008 మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కాంట్రాక్ట్ టీచర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సైన్స్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు 2008 ఎంటీఎస్ టీచర్లకు, మధ్యాహ్నం 2 గంటలకు 1998 ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లందరూ తప్పకుండా సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆదేశించారు.

టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. బుధవారం 2,387 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం నాటికి పూర్తిగా పడిపోయింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,612.97 అడుగుల నీటి మట్టం వద్ద 43.765 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఇన్‌ఫ్లో 1,904 క్యూసెక్కులుంటే అవుట్‌ఫ్లో 297 క్యూసెక్కులుగా ఉండేది. ప్రస్తుతం డ్యాంలో 1,579.45 అడుగుల నీటి మట్టం వద్ద 4.209 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. 1,577 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ఈ ఏడాది డ్యాంకు వరద మొదలు కాలేదు.

'జారుతున్న' జీవితాలు!



- ప్రయాణికులతో ఈ నెల 7న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కిక్కిరిసి వెళ్తోంది. మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్ర యాదవ్ (24) జనరల్ బోగీలో స్థలం లేక ఫుట్‌బోర్డు వద్ద కూర్చొని ప్రయాణిస్తున్నాడు. తాడిపత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని వంగనూరు వద్ద రైలు కుదుపులకు గురవడంతో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తీవ్రగాయాలపాలై ఘటనాస్థలిలోనే దుర్మరణం పాలయ్యాడు.

- మే నెల 29న కల్లూరు రైల్వేస్టేషన్ నుంచి కదులుతున్న తిరుపతి–గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కుతూ ఓ హిజ్రా పట్టు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరే కాదు.. ప్రమాదవశాత్తూ రైలు కింద పడడంతో ఒక్క గుంతకల్లు రైల్వే డివిజన్‌లో రెండున్నరేళ్ల (31 మే వరకూ)లోనే దాదాపు 628 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గాయపడ్డారు.

- రైలు ప్రయాణంలో ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం
- రెండున్నరేళ్లలోనే వందల మంది మృతి
- పెరగని సాధారణ బోగీలతోనూ సమస్య
- అవగాహన లేక అందని బీమా

గుంతకల్లు: రైల్వేశాఖ ఉదాసీనత, ప్రయాణికుల నిర్లక్ష్యం, తొందరపాటు.. వెరసి ఏటా అనేక ప్రాణాలు అనంతవాయువుల్లో కలుస్తున్నాయి. వందల మంది అంగవికలురుగా మారుతున్నారు. రైళ్లలో ఫుట్‌బోర్డు ప్రయాణం, కదులుతున్న బండిని ఎక్కడం, దిగడం, నిర్లక్ష్యంగా ట్రాక్ దాటడం.. కారణమేదైతేనేం.. ప్రాణాలు పోవడమో, చేతులు, కాళ్లు విరగడమో జరుగుతోంది.

పెరగని బోగీలతోనూ సమస్యే...

రైల్వేశాఖ ఉదాసీన వైఖరి కూడా ప్రమాదాలకు మరో ప్రధాన కారణంగా కనిపిస్తోంది. బస్సు చార్జీల కంటే రైలు చార్జీలు తక్కువ కావడంతో నానాటికీ ప్రయాణికుల సంఖ్య పెరిగిపోతుంది. అందుకనుగుణంగా సాధారణ తరగతి రైలు బోగీలు పెరగడం లేదు. పైగా అనేక రైళ్లల్లో జనరల్ బోగీల సంఖ్యను తగ్గించారు. ఫలితంగా ప్రతి రైలులో జనరల్ బోగీలు కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడడానికి కూడా స్థలం లేక లెట్రిన్‌లు, ఫుట్‌బోర్డుల వద్ద నిలబడి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. వేసవి కావడంతో ఉక్కపోత కారణంగా ఫుట్ డోర్ వద్ద కూర్చోడానికి, నిలబడ్డానికి ఆసక్తి చూపుతారు. దీంతో స్టేషన్ వచ్చినప్పుడు రైలు దిగడానికి గాని, ఎక్కడానికి గానీ వీలుకాని పరిస్థితి. ఫలితంగా రైలు ఎక్కడైనా కుదుపులకు లోనైనప్పుడు కింద పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ తరహా ప్రమాదాలు కూడా దాదాపు జనరల్ బోగీల వద్దనే జరుగుతున్నాయి. ఫుట్‌బోర్డు ప్రయాణంతో కలిగే హాని గురించి నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే.. ప్రతి రైలులో జనరల్ బోగీల సంఖ్యను పెంచాల్సిన తక్షణ బాధ్యత రైల్వే శాఖపై ఉంది.

గుంతకల్లు డివిజన్‌లో ప్రమాదవశాత్తూ మరణించిన వారి వివరాలు ఇలా..

ఏడాది	మృతిచెందిన వారు	గుర్తు తెలియని మృతదేహాలు
2021	253	63
2022	263	114
2023 (మే 31వరకు)	112	44

ఇన్సూరెన్స్ సమస్యలు..

రైలు ప్రమాద ఘటనల్లో మరణించిన ప్రయాణికులకు రూ.8 లక్షల వరకూ ప్రమాద బీమాను రైల్వేశాఖ కల్పిస్తోంది. టికెట్ ఉన్న ప్రయాణికులకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి కూడా బీమా సౌకర్యం ఉంటుంది. అయితే టికెట్ తీసుకున్నా ప్రమాద ఘటన వద్ద అది ఎక్కడో పడిపోతున్న కారణంగా.. అర్హులై ఉండి కూడా బీమాకు నోచుకొని ప్రయాణికులు ఎందరో? ఉంటున్నారు. వీటన్నింటిపైనా విస్తృత స్థాయిలో రైల్వేశాఖ అవగాహన కల్పించాల్సి ఉంది.

అప్రమత్తం చేస్తున్నాం



ఫుట్ బోర్డు ప్రయాణం, రన్నింగ్ రైలు ఎక్కడం, దిగడంపై ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నాం. రైళ్లలో బీట్ డ్యూటీలో ఉన్న మా సిబ్బందితో పాటు టీసీలు అనర్థాలను తెలియజేస్తున్నారు. ప్రయాణికులు కూడా ఫుట్ బోర్డు ప్రయాణం చేయకుండా సహకరించాలి. 1511 నంబరుకు ఫోన్ చేసి అలా ప్రయాణించే వారిపై ఫిర్యాదు చేయొచ్చు.

– కే.చౌడేశ్వరీ, జీఆర్పీ ఎస్పీ, గుంతకల్లు

లేపాక్షి ఆలయంలో ఇస్కాన్ సంస్థ చైర్‌పర్సన్



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ఇస్కాన్ సంస్థల చైర్‌పర్సన్ రేవతి

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి ఆలయాన్ని అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థల చైర్‌పర్సన్ రేవతి, రమణ ప్రభు దంపతులు గురువారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఆలయంలోని చిత్రాలు, శిల్పాలు తిలకించి, అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ప్రసాద భవనాన్ని సందర్శించి, అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు.

జేఎన్‌టీయూ(ఏ) పాలకమండలి సమావేశం రేపు



అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పాలకమండలి సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నారు. వీసీ జింకా రంగజనార్దన అధ్యక్షతన వర్సిటీ పాలక భవనంలో జరిగే సమావేశానికి అందుబాటులో ఉండే వారు నేరుగా, లేని వారు వర్చువల్‌గా పాల్గొననున్నారు. పలు కీలక అంశాలను ఎజెండాలో చేర్చారు.

ఓపికతో వినాలి.. పరిష్కారం చూపాలి

- ప్రణాళికాబద్ధంగా 'జగనన్న సురక్ష'
- ప్రతి కార్యాలయంలో కంట్రోల్ రూమ్
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం





తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు ఓపికతో సమస్య విని, పరిష్కరించడంపై సారించాలన్నారు.కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.గురువారం కలెక్టరేట్‌లో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలిసి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్‌డీలు, ఆర్‌డీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు, కమిషనర్లు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో ఒక్క ఇల్లూ వదలకుండా సందర్శించాలని చెప్పారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు వెళుతున్నారా లేదా అనేది పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. డాక్యుమెంట్‌లు సక్రమంగా ఉంటేనే సర్వీస్ రిక్వెస్ట్ రైజ్ చేయాలని ఆదేశించారు. నెల పాటు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్‌డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే మాతాశిశుమరణాలు

''ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు రెండు మాతృ మరణాలు, రెండు శిశు మరణాలు సంభవించాయి. ఈ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పునరావృతమైతే తీవ్ర చర్యలు తప్పవు'' అంటూ కలెక్టర్ గౌతమి హెచ్చరించారు. వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. మాతృ మరణాల్లో ప్రొటోకాల్ అనుసరించారా లేదా విచారించి నివేదిక అందించాలని డీఎంహెచ్ఓని ఆదేశించారు. పీహెచ్‌సీల పరిధిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీలను వైద్యాధికారి పరిశీలించాలన్నారు. రోగులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. డీఎంహెచ్ఓ వీరబ్బాయి, డీఐఓ యుగంధర్ తదితరులున్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

అనంతపురం అర్బన్: సహకార సంఘాలను బలోపేతం చేయాలని కలెక్టర్ గౌతమి సూచించారు. ఎంపీఎఫ్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్) గోదాముల నిర్మాణం వేగవంతం చేయాలని ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి జిల్లా కో–ఆపరేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. 84 ఎంపీఎఫ్‌సీ గోదాములు మంజూరు చేస్తే మూడు మాత్రమే పూర్తయ్యాయని, పనులు వేగవంతం చేయాలన్నారు. రెండో విడతలో చేపట్టాల్సిన గోదాములకు టెండర్లు పిలిచామని, ప్రక్రియ పూర్తైన వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఓ ప్రభాకర్‌రెడ్డి, మత్స్యశాఖ డీడీ శాంతి తదితరులున్నారు.

- జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. 310 ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు లక్ష్యం విధించగా.. 142 మాత్రమే గుర్తించారన్నారు. ప్రక్రియను జిల్లా రీసోర్స్ పర్సన్లు చేపట్టాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజు తదితరులున్నారు.

'ఫేక్' అయితే క్రిమినల్ కేసులు



సర్టిఫికెట్ల పరిశీలన వివరాలను తెలుసుకుంటున్న డీఈఓ సాయిరామ్

- జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్

రాప్తాడురూరల్: కేజీబీవీల ఎస్‌ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీలో ఎవరైనా ఫేక్ సర్వీస్ పాయింట్లు చూపి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డీఈఓ, సమగ్ర శిక్ష ఏపీసీ సాయిరామ్ హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీకి ప్రాథమిక మెరిట్ జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రశాంతంగా జరిగింది.బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో ఆందోళన చేసిన కొందరు అభ్యర్థులు.. గురువారం కూడా నిరసనకు దిగారు. సర్వీస్ పాయింట్లు ఇష్టానుసారంగా వేశారని ఆరోపించారు. డీఈఓ స్పందిస్తూ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. పరిశీలనకు నియమించిన టీంల సభ్యులతోనూ మాట్లాడినా ఆయన.. ఏ చిన్న పొరపాటు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సర్టిఫికెట్లు ఒకటికి రెండుసార్లు పరిశీలించారు. డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, జీసీడీఓ వాణీదేవి, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు పర్యవేక్షించారు.

597 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

కేజీబీవీ ఎస్‌ఓ, సీఆర్టీ పోస్టుల భర్తీకి సంబంధించి గురువారం 597 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. మొత్తం 787 మంది సీనియార్టీ జాబితాలో ఉన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన 597 మందిలో 17 మంది అనర్హులుగా నిర్ధారించారు. గైర్హాజరైన 190 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం గడువు ఇచ్చినట్లు డీఈఓ సాయిరామ్ తెలిపారు.

'ఏఐఎస్‌ఎఫ్' ఆందోళన..

కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా చాలా ఏళ్ల నుంచి పని చేస్తున్న వారిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ. కుళ్లాయిస్వామి, చిరంజీవి మాట్లాడుతూ కొందరు అభ్యర్థులు నకిలీ సర్వీస్ సర్టిఫికెట్లు జత చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమామహేష్, నాయకులు వంశీ, నరసింహ యాదవ్, రఘు, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మోసాల 'ఆదరణ'!

- అనంతపురంలోని బోయవీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉద్యోగి పి.శ్రీరామిరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదరణ చిట్ ఫండ్స్‌లో సభ్యుడిగా చేరాడు. రూ.25 లక్షల చిట్‌కు రూ.62,500 నెలవారీ చందాతో 40 నెలలుగా చెల్లిస్తున్నాడు. శ్రీరామిరెడ్డి వెళ్లి రశీదులు తీసుకుని వచ్చేవాడు. చిట్ 2022 డిసెంబరులో పూర్తయినా, నేటికీ పైసా కూడా చెల్లించలేదు. కార్యాలయానికి వెళితే చాలా నీచంగా మాట్లాడుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటే మాకూ పోలీసులు తెలుసు, మేం కూడా ఫిర్యాదు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఇది ఒక్క శ్రీరామిరెడ్డి ఆవేదనే కాదు. 'ఆదరణ'లో చిట్స్ వేసిన వారిలో ఇలాంటి వందల మంది ఉన్నారు.

- 'ఆదరణ చిట్ ఫండ్స్'పై కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- బెదిరింపులకు దిగుతున్న సంస్థ ప్రతినిధి
- 'జగనన్నకు చెబుదాం'లో బాధితుడి ఫిర్యాదు
- ఎస్పీ వద్ద నేడు 'పంచాయితీ'



ఆదరణ చిట్‌ఫండ్ కార్యాలయంలో శైలజతో మాట్లాడుతున్న చందాదారులు (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదరణ చిట్‌ఫండ్స్ మోసాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఆదుకుంటుందన్న ఆశతో కష్టార్జితాన్ని పోగేసి ఆదరణ చిట్‌ఫండ్‌కు కడితే సకాలంలో చెల్లించకుండా బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. చిట్ మెచ్యూరిటీ పూర్తయిన తరువాత కూడా తమకు డబ్బు ఇవ్వకుండా.. బొట్టుకు పని చేయని భూములను అమాంతం ధరలు పెంచి అంటగడుతున్నట్లు పలువురు చందాదారులు ఆరోపిస్తున్నారు. కట్టిన డబ్బు చేతికి రాలేదని బాధ పడాలో.. పనికి రాని భూమి తీసుకుని మరింత భారం మోయాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

రెచ్చిపోతున్న శైలజ..!

ఆదరణ చిట్‌ఫండ్స్ యాజమాన్యంలో ఒకరైన శైలజ సరైన సమాధానం ఇవ్వడం లేదని, పైపెచ్చు హీనంగా మాట్లాడుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. పోలీసులూ తమనేం చేయలేరంటూ బెదిరిస్తున్నారన్నారు. డబ్బు చేతికి రాలేదన్న ఆవేదనతో పోలీసు స్టేషన్‌కు వెళితే.. కనీసం కేసు కూడా నమోదు చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే ఆదరణ బాధితులు పదుల సంఖ్యలో పోలీసులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

ఎస్పీ సీరియస్.. నేడు రావాలని ఆదేశం..

రాష్ట్ర ప్రభుత్వం సత్వర న్యాయం అందించాలన్న లక్ష్యంతో ప్రవేశ పెట్టిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ఇటీవల 'ఆదరణ' బాధితుడొకరు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యాలయం వారు కేసును వన్‌టౌన్ పోలీసులకు పంపారు. పోలీసులు బాధితుడిని పిలిచి ఆదరణ చిట్‌ఫండ్స్ వారిని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడతామని చెప్పారు. అనంతరం పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే సీఎం కార్యాలయం నుంచి బాధితుడికి ఫోన్ వచ్చింది. సమస్య పరిష్కారమైంది కదా? అని ఆరా తీశారు. పోలీసులు కనీసం పట్టించుకోలేదని బాధితుడు వాపోవడంతో.. సీఎం కార్యాలయ సిబ్బంది విషయాన్ని నేరుగా కలెక్టర్ గౌతమి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు వివరించడంతో... ఆయన వన్‌టౌన్ పోలీసులు పంపిన తప్పుడు రిపోర్టుపై సీరియస్ అయ్యారు. బాధితులతో మాట్లాడారు. తన కార్యాలయానికి శుక్రవారం ఉదయం రావాలని సూచించారు.

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె

అనంతపురం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 24 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. 26 నుంచి 30 వరకూ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుంది. జులై 3న సీట్ల కేటాయింపు, 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఎస్కేయూ పరిధిలో 86 డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ అడ్మిషన్లు కల్పించనున్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్లు..

గతంలో డిగ్రీ అడ్మిషన్లు ప్రతిభ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వారీగా ఉండేవి కాదు. నాణ్యత ప్రమాణాలు గల కళాశాలలో సీటు దక్కాలంటే కష్టసాధ్యమయ్యేది. రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి డిగ్రీ అడ్మిషన్లలోనూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుకు శ్రీకారం చుట్టింది. ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించే పద్ధతికి శ్రీకారం చుట్టింది. దీంతో ప్రతిభ ఆధారంగా సీట్లు దక్కుతున్నాయి.

ఆనర్స్ డిగ్రీ విధానం..

నాన్ ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సుల్లోనూ ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ ఆనర్స్ విధానం అమల్లోకి వచ్చింది. మూడు సంవత్సరాల డిగ్రీ చాలు అనుకుంటే ఎగ్జిట్ ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. నాలుగో సంవత్సరం చదివితే ఆనర్స్ డిగ్రీని ప్రదానం చేస్తారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సును అందుబాటులోకి తెచ్చారు.

క్లుప్తంగా

గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంచండి


రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి రమ

కూడేరు: గ్రంథాలయాల్లో సభ్యత్వాలు పెంపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి రమ పిలుపునిచ్చారు. గురువారం కూడేరులోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. పాఠకులు సంఖ్యను గ్రంథాలయాధికారి రాధారాణితో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. గ్రామంలో పర్యటించి గ్రంథాలయ సభ్యత్వం పెంపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గత ఏడాది సుమారు రూ.35 లక్షల విలువ చేసే పుస్తకాలను కొనుగోలు చేసి పాఠకులకు అందుబాటులో ఉంచామన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సజావుగా డ్రైవర్ల బదిలీలు

అనంతపురం క్రైం: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డ్రైవర్ల సాధారణ బదిలీలు గురువారం సజావుగా జరిగాయి. బదిలీల కౌన్సిలింగ్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 13 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కాగా, ఏడుగురు రీటెన్షన్(యథాస్థానాలకు) కాగా, మరో ఆరుగురు వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్ మోసెస్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రానందం.. నృత్యోత్సవం




జ్యోతి ప్రజ్వలనతో సంధ్యారవళి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్యాలాపురం శ్రీకాంత్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం తదితరులు

- వివిధ రాష్ట్రాల సంస్కృతులను చాటిన 'సంధ్యా రవళి'

అనంతపురం కల్చరల్: వివిధ రాష్ట్రాల సంస్కృతులు.. విభిన్న నాట్య సంప్రదాయాల మేళవింపుతో అనంత పులకించింది. దేశ వ్యాప్తంగా విచ్చేసిన కళాకారుల అభినయంతో 'సంధ్యా రవళి' నేత్రానందం కలిగించింది. అనంత వేదికగా మరోసారి రికార్డు స్థాయిలో 12 గంటల నిర్విరామ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నయనమనోహరంగా సాగాయి. సంధ్యా రవళి పేరుతో టీటీడీ కల్యాణ మంటపం వేదికగా గురువారం 'ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్' నృత్యోత్సవం ఘనంగా జరిగింది. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి తరలివచ్చిన కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, సెమీ క్లాసికల్, ఫోక్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్య బృందం, మహాలక్ష్మి మిత్ర బృందం వివిధ శాస్త్రీయ, జానపద నృత్యరీతులతో అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఏడుపదుల వయసులోనూ సంధ్యామూర్తి ఉత్సాహంగా చిన్నారులతో కలసి చేసిన నాట్యం అందరిలో ఉత్సాహం నింపింది. వివిధ నాట్యరీతులతో ఆకట్టుకున్న కళాకారులకు నటనా సారంగి , గురువులకు ఆచార్య సింధూ అవార్డులతో సత్కరించారు.

పద్మశ్రీకి సంధ్యామూర్తి అర్హురాలే

అనంత నాట్యకీర్తిని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించిన నాట్యాచార్యులు సంధ్యామూర్తి అత్యున్నత పద్మశ్రీ అవార్డుకు అర్హురాలేనని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ అవార్డుకు నామినేట్ చేసేలా అన్ని సంస్థల వారూ కృషి చేయాలని తీర్మానించారు. గురువారం. ఉదయం 'సంధ్యారవళి' ప్రారంభ కార్యక్రమానికి ఏపీ నాటక అకాడమీ చైర్ పర్సన్ రాగే హరిత, రాష్ట్ర దేవాదాయ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పర్యాటక శాఖ రాష్ట్ర డైరెక్టర్ భూమిరెడ్డి జాహ్నవి, జిల్లా టూరిజం శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, అనంతపురం నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, ఆచార్య సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, ప్రముఖ నాట్యాచార్యులు సందీప్‌కుమార్, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఫౌండర్ శేషసాయి, కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ప్రభాకర రావు, బుల్లితెర సీనియర్ నటి విజయలక్ష్మి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. శాస్త్రీయ నృత్యానికి, సంగీతానికి సంధ్యామూర్తి అందిస్తున్న సేవలను కొనియాడారు. కళలు మానసిక ప్రశాంతతను తెస్తాయని, చిన్నారులలో ఉండే కళలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు సంధ్యామూర్తిని ఆత్మీయ అతిథులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పలువురు అధికారులు, నాట్య గురువుల చేతుల మీదుగా చిన్నారులకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జాతీయ నృత్యోత్సవ కమిటీ ప్రతినిధులు నందకుమార్, శ్రీనిధి రఘు, విజయ్‌సాయి, రియాజుద్దీన్ పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న సంధ్యామూర్తి శిష్యబృందం


నృత్య ప్రదర్శనలో కర్ణాటక బృందం

ఆర్డీఓగా ట్రైనీ కలెక్టర్


ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న డీటీ సూర్యప్రతాప్

కళ్యాణదుర్గం: శిక్షణలో భాగంగా కళ్యాణదుర్గం ఆర్డీఓ (ఇండిపెండెంట్)గా ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల పాటు శిక్షణకు హాజరైన ఆయనకు కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని మండలాల స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఈత కొలను సీజ్


స్విమ్మింగ్ పూల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: స్థానిక హిందూపురం రోడ్డులో అనధికారికంగా నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు సీజ్ చేశారు. ఇటీవల ఈతకు వెళ్లిన 6వ తరగతి విద్యార్థి చరణ్ నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, టౌన్ ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, ఆర్‌ఐ కృష్ణ, వీఆర్వో కార్తీక్ గురువారం స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ ఏర్పాటులో నిబంధనలు అతిక్రమించడంతో ఎలాంటి రికార్డులు నిర్వహించడం లేదని గుర్తించి, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి కారణమైన నిర్వాహకులపై కేసు నమోదుకు సిఫారసు చేస్తూ స్విమ్మింగ్ పూల్‌ను సీజ్ చేశారు.

ఎన్‌సీసీ శిక్షణతో బంగారు భవిత

- ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్‌ముంద్రా


ఫైరింగ్‌పై శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: ఎన్‌సీసీలో శిక్షణ పొంది ఏ,బీ, సీ సర్టిఫికెట్లు పొందితే బంగారు భవిష్యత్తు దక్కుతుందని 6వ ఆంధ్రా బెటాలియన్ క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీఏటీసీ-1 తొలి క్యాంప్ ఈ నెల 19న ప్రారంభమైంది. ఈ క్యాంప్‌లో కర్నూలు, అనంతపురం, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 500 మంది క్యాడెట్లు (ప్రాథమిక సైనిక శిక్షణ పొందుతున్న పాఠశాల విద్యార్థులు) పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా గురువారం ఫైరింగ్‌పై మెలకువలు నేర్పారు. కల్నర్ సందీప్ ముంద్రా మాట్లాడుతూ.. ఏకాగ్రతతో షూట్ చేస్తే లక్ష్యాన్ని ఛేదించవచ్చునన్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్రను వివరించారు. ఫైరింగ్‌లో లక్ష్యాన్ని ఛేదించిన క్యాడెట్లను అభినందించారు. కార్యక్రమంలో మేజర్ సుఖ్‌దేవ్, అధికారులు శ్రీనివాసులు, సత్యం రెడ్డి, రాకేష్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

పంది కోసం చితక్కొట్టారు!

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పంది కోసం గొడవ పెట్టుకుని ప్రాణాలు పోయేలా చితక్కొట్టిన ఘటన అనంతపురం నడిబొడ్డున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని సూర్యానగర్ 80 అడుగుల రోడ్డు సమీపంలో నివాసముంటున్న ఆదినారాయణ, కుమార్, వెంకటేష్, శ్రీరాములు, రాజు బృందంగా ఏర్పడి పందులు దొంగలించి, గుట్టుగా అమ్ముకునేవారు. తద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. ఈ నేపథ్యంలో అనంతపురంలోని పాతూరు భవానీనగర్‌కు చెందిన లోకవర్దన్, మధుసూదన్‌కు చెందిన పందిని అపహరించారు. ఈ విషయం నిర్ధారించుకున్న యజమానులు నేరుగా ఆదినారాయణ బృందాన్ని కలసి ఆరా తీసి, మరోసారి పందులను అపహరించుకెళితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో కక్ష పెంచుకున్న ఆదినారాయణ బృందం గురువారం రాత్రి ఐరన్ బ్రిడ్జి సమీపంలోని విశ్వంభర కల్యాణమంటపం వద్ద లోకవర్దన్, మధుసూదన్‌తో గొడవ పెట్టుకుని విచక్షణారహితంగా దాడి చేశారు. ప్రాణాపాయ స్థితికి చేరేంతగా చితకబాదారు. అల్లరి మూకలు కావడంతో స్థానికులు జోక్యం చేసుకోలేక పోయారు. ఆదినారాయణ బృందం అక్కడి నుంచి వెళ్లిపోగానే క్షతగాత్రులను సర్వజనాస్పత్రికి తరలించారు. వీరిలో లోకవర్దన్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిర్మాణాల బిల్లులకు లైన్ క్లియర్

నియోజకవర్గాల వారీగా విడుదలైన నిధులు	
నియోజకవర్గం	నిధులు
తాడిపత్రి	రూ.10.45 కోట్లు
శింగనమల	రూ.9.70 కోట్లు
కళ్యాణదుర్గం	రూ.9.02 కోట్లు
రాయదుర్గం	రూ.7.51 కోట్లు
ఉరవకొండ	రూ.5.62 కోట్లు
అనంతపురం	రూ.4.49 కోట్లు
రాప్తాడు	రూ.3.31 కోట్లు
గుంతకల్లు	రూ.3.12 కోట్లు
బీటీ, సీసీ రోడ్లకు సంబంధించి	రూ.27.66 కోట్లు

- జిల్లాకు రూ.80.88 కోట్లు విడుదల
- కాంట్రాక్టర్ల ఖాతాల్లో వంద శాతం నిధులు జమ చేసిన సర్కారు
- ఇది సరికొత్త రికార్డుగా పేర్కొంటున్న ఇంజినీరింగ్ అధికారులు

అనంతపురం సిటీ: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి జగన్ సర్కార్ నిధులు విడుదల చేసింది. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేసింది. పూర్తయిన పనులకు సంబంధించి వంద శాతం నిధులు జమ చేయడాన్ని ఓ సరికొత్త రికార్డుగా ఇంజినీరింగ్ అధికారులు అభివర్ణిస్తున్నారు. కలెక్టర్ ఎం.గౌతమి చొరవతో ఒక్క అనంతపురం జిల్లాకే రూ.80.88 కోట్లు విడుదల కావడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో బీటీ, సీసీ రహదారులతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలు, ఉపాధి, అభివృద్ధికి సంబంధించిన బకాయిలన్నీ ఒకేసారి చెల్లించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.


అనంతపురం మండలం ఎ.నారాయణపురంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

సెప్టెంబర్‌లోపు పూర్తి చేయాలి



ప్రస్తుతం నిర్మాణాల్లో ఉన్న ప్రభుత్వ భవనాలన్నీ సెప్టెంబర్ 30వ తేదీలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. ఇప్పటికే పూర్తయిన భవనాలను ఆయా శాఖలకు స్వాధీనం చేయాలని సూచించాం. సాంకేతిక, ఇతర కారణాలతో ఒకట్రెండు బిల్లులు పెండింగ్‌లో ఉంటే వాటిని పరిశీలించి క్లియర్ చేస్తాం. ప్రభుత్వం వద్ద నిధుల కొరత లేదు. పనులు త్వరితగతిన పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు మంజూరవుతున్నాయి.

– భాగ్యరాజ్, ఎస్‌ఈ, పంచాయతీరాజ్ శాఖ

కుక్కల దాడిలో గొర్రెల మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాలవాయిలో కుక్కల దాడిలో పది గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజినాయక్ గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి తన గొర్రెల మందను గ్రామ శివారులోని దొడ్డిలో వదిలి ఇంటికెళ్లి నిద్రించాడు. గురువారం ఉదయం నిద్రలేచి మంద వద్దకెళ్లి చూడగా మృతి చెందిన పది గొర్రెలు కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. తొలుత అడవి జంతువుల దాడిలో గొర్రెలు మృతిచెందినట్లుగా అనుమానాలు వ్యక్తం కావడంతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ నాగేనాయక్, వాచర్లు నరేంద్ర, రాజేష్, గోపాల్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనతో రూ.1లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

పారదర్శక పరిశీలన చేపట్టండి

- నిజనిర్ధారణ కమిటీలకు జేఎన్‌టీయూ(ఏ) వీసీ జింకా రంగజనార్దన ఆదేశం

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో సౌలభ్యాలపై తనిఖీలను పారదర్శకంగా చేపట్టాలని నిజనిర్ధారణ కమిటీలను ఆ వర్సిటీ వీసీ ఆచార్య జింకా రంగజనార్దన ఆదేశించారు. తనిఖీల ప్రక్రియపై జేఎన్‌టీయూ(ఏ) కానిస్టిట్యూట్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లతో గురువారం ఆయన వర్చువల్ విధానంలో సమీక్షించారు. కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగానే ఆయా కళాశాలలకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇప్పటికే ఆయా కళాశాలలు ఆన్‌లైన్‌లో పొందుపరిచిన రీతిలో సౌలభ్యాలున్నాయా? లేదా అని నిర్ధారించాలన్నారు. అధ్యాపక – విద్యార్థి నిష్పత్తి, ల్యాబ్ సదుపాయం, గ్రంథాలయం, ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించి ల్యాబ్, ఆటస్థలం, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, ఫ్యాకల్టీల అర్హత, క్రీడా నైపుణ్యాలు తదితర అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనపు కోర్సుల అమలుకు సరైన సదుపాయాలు ఉన్నది, లేనిది గుర్తించాలన్నారు. ఆయా కళాశాలలు అటానమస్, పర్మినెంట్ అఫిలియేషన్‌కు వెళుతుంటే అందుకు సంబంధించిన సెల్ఫ్ అసెస్‌మెంట్ రిపోర్ట్‌ను తనిఖీ చేయాలన్నారు. ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ సమాచారాన్ని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్ నుంచి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (ఏ) రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ ప్రొఫెసర్ సురేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి.సుమలత, ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకు జాతీయ స్థాయి గుర్తింపు

- సివిల్, కెమికల్ విభాగాలకు ఎన్‌బీఏ ధ్రువీకరణ
- నాణ్యమైన విద్యాబోధనకు దక్కిన ప్రతిఫలం
- కంపెనీ అవసరాలకు తగిన మానవ వనరుల ఉత్పత్తికి దోహదం


జేఎన్‌టీయూ (ఏ)లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం

అనంతపురం: జేఎన్‌టీయూ(అనంతపురం)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రాష్ట్రంలో సాంకేతిక విద్య అందిస్తున్న కళాశాలల్లో విద్య, వసతులపై ఇటీవల 'నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) బృందం తనిఖీలు నిర్వహించింది. కళాశాలలో మౌలిక వసతులతో పాటు ఇతర అంశాలను జాతీయ స్థాయి బృందం క్షుణంగా పరిశీలించింది. కళాశాలల్లో అమలు చేస్తున్న కోర్సులు, ల్యాబ్స్‌ను తనిఖీ చేసింది. అధ్యాపకుల బోధనా పద్ధతులు, వారి విద్యార్హతలను ఆరా తీసింది. కళాశాలలో విద్యార్థులకు అందించే సాంకేతిక విద్య(టెక్నికల్ స్టాండర్డ్స్), సాంకేతిక విద్యామండలి నివేదికల ప్రకారం తరగతుల నిర్వహణ, కళాశాలలో అమలు చేస్తున్న అకడమిక్ ఫలితాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకుల నిష్పత్తి వంటి అంశాలను పరిశీలించి తుది నివేదికను ఉన్నత విద్యామండలి దృష్టికి తీసుకెళ్లి జేఎన్‌టీయూ (ఏ)లోఉని సివిల్, కెమికల్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునిచ్చింది. సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు దక్కడంపై జేఎన్‌టీయూ (ఏ) వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన, రిజిస్ట్రార్ సి.శశిధర్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌బీఏ గుర్తింపుతో కళాశాలకు జాతీయ స్థాయిలో కీర్తి దక్కిందన్నారు.

మూడేళ్ల పాటు గుర్తింపు..

జేఎన్‌టీయూ(ఏ)కు దక్కిన నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు మూడేళ్ల పాటు కొనసాగనుంది. క్యాంపస్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనకు గుర్తింపుగా ఇప్పటికే పలుమార్లు ఎన్‌బీఏ ధ్రువీకరణను జేఎన్‌టీయూ(ఏ) దక్కించుకుంది. గతంలో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు వచ్చింది. తాజాగా తాజాగా సివిల్, కెమికల్ విభాగాలకు గుర్తింపు దక్కడంతో ఆ సంఖ్య నాలుగు నుంచి ఆరుకు చేరుకుంది. కాగా, జేఎన్‌టీయూ(ఏ)లోనే అత్యంత పురాతన విభాగంగా ఖ్యాతిగాంచిన సివిల్ ఇంజినీరింగ్‌కు వరుసగా ఐదు దఫాలుగా ఎన్‌బీఏ గుర్తింపు దక్కడం గమనార్హం. నిష్ణాతులైన ప్రొఫెసర్లు, అత్యాధునిక ప్రయోగశాలలు, లర్నింగ్ బై డూయింగ్ విధానంలో బోధనాభ్యసన ప్రక్రియ కొనసాగడంతో జేఎన్‌టీయూ (ఏ)లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోంది. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు.

ఎన్‌బీఏ గుర్తింపుతో చేకూరే ప్రయోజనాలు..

విద్య, బోధనలో నాణ్యత ప్రమాణాలు ఉంటేనే ఎన్‌బీఏ గుర్తింపు దక్కుతుంది. ఎన్‌బీఏ గుర్తింపు దక్కిన కోర్సులపై మూడేళ్లపాటు సాంకేతిక విద్యామండలి ప్రత్యేక దృష్టి పెడుతుంది. భవిష్యత్‌లో కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందజేస్తుంది. ఏటా కళాశాలలో ఉన్నత స్థాయి కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. విద్యార్థులకు పరిశోధన ప్రాజెక్టులు, నిధులు మంజూరుకు అవకాశం ఏర్పడుతుంది. ఫ్యాకల్టీ నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక ఓరియంటేషన్ శిక్షణ అందుతుంది. సాధారణంగా పరీక్షలు రాశాక మార్కులను బట్టి డిగ్రీలు అందజేస్తారు. అయితే ఎన్‌బీఏ గుర్తింపు తర్వాత అవుట్ కమ్ బేస్డ్ పరీక్షలు రాసి, ఉద్యోగంలో స్థిరపడిన ఐదేళ్ల వరకూ సదరు విద్యార్థిపై పరిశీలన ఉంటుంది. ఒకవేళ ఉద్యోగం రాకుంటే నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటారు. పారిశ్రామిక రంగంపై ఆసక్తి ఉంటే అందుకు తగ్గట్టుగా విద్యార్థులను సంసిద్ధం చేస్తారు. 100 మంది అడ్మిషన్లు పొందితే వారందరూ జీవితంలో స్థిరపడేలా ఎప్పటికప్పుడు ఐదేళ్ల పాటు పరిశీలన ఉంటుంది.

క్లుప్తంగా

నేటినుంచి 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమానికి శ్రీకారం చుడతామని, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు ఆయా గ్రామ సచివాలయాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ సుజాత

ఆత్మకూరు: ముదిగుబ్బ వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఏపీఓ సుజాత పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పొంది వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సిబ్బందికి ఆమె సూచించారు.

సర్వజనాస్పత్రిలో హిజ్రాలకు హెల్ప్ డెస్క్

అనంతపురం క్రైం: వైద్యం కోసం సర్వజనాస్పత్రికి వచ్చే హిజ్రాల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. గత నెలలో ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ రఘునందన్‌తో సమావేశమై హెల్ప్ డెస్క్ ఏర్పాటుపై చర్చించిన విషయం తెలిసిందే. హెల్ప్ డెస్క్ ఏర్పాటుకు సర్వజనాస్పత్రిలోని పలు ప్రాంతాలను సూపరింటెండెంట్ గురువారం పరిశీలించారు.

ఎంపీ రంగయ్యకు సన్మానం



ఎంపీ తలారి రంగయ్యను సన్మానిస్తున్న రంగంపేట గోపాల్‌రెడ్డి

అనంతపురం క్రైం: ఇటీవల తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన రంగంపేట గోపాల్ రెడ్డి గురువారం ఎంపీ తలారి రంగయ్యను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రంగంపేట గోపాల్ రెడ్డికి ఎంపీ సూచించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణి

రాప్తాడు: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు గ్రామాల్లో కుష్టుపై సర్వేను పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారిణి శ్రావణి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి కుష్టుపై ఆమె అవగాహన కల్పించారు. చర్మంపై మచ్చలు, బుడిపెలు ఉన్నవారిని పీహెచ్‌సీకి తీసుకువచ్చి పరీక్షలు చేయించాలన్నారు. మందులు వాడితే కుష్టు పూర్తిగా నయమవుతుందని తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్లు అరుణమ్మ, లక్ష్మీ నారాయణమ్మ పాల్గొన్నారు.

కమిషరేట్‌కు డీపీఆర్ఓ రమేశ్

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) పి.రమేశ్‌బాబు ఆన్ డ్యూటీ కింద నెల రోజులు కమిషనరేట్‌లో విధులు నిర్వర్తించాలని సమాచార శాఖ కమిషనర్ టి.విజయకుమార్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను తక్షణం విధుల నుంచి రిలీవ్ చేయాలని డీఐపీఆర్ఓని ఆదేశించారు.

'నాడు-నేడ' పనులు పూర్తి చేయండి



ముట్టాలలోని పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈ మహమ్మద్‌రసూల్

ఆత్మకూరు: పాఠశాలల్లో నాడు- నేడు కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ మహమ్మద్ రసూల్ సూచించారు. మండల ఇంజినీర్ పార్థసారథి, ఎంఈఓ నరసింహారెడ్డితో కలసి గురువారం ఆయన మండలంలోని వడ్డుపల్లి, తలుపూరు, ముట్టాల గ్రామాల్లో పర్యటించారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులనుపరిశీలించారు. సకాలంలో బిల్లులు మంజూరవుతున్నాయని పనులు నాణ్యతగా ఉండాలని సూచించారు.



రాయితీ వేరుశనగ విత్తనం తీసుకొస్తున్న అన్నదాత



గార్లదిన్నె మండలంలో చీనీ తోటలో అంతర్ పంటగా వేరుశనగను సాగు చేస్తున్న దృశ్యం

● జోరుగా విత్తన ప్రక్రియ

నైరుతి రుతుపవనాల రాకతో జిల్లాలో పలు ప్రాంతాల్లో పదునయ్యే వర్షాలు కురిశాయి. దీంతో అన్నదాతలు విత్తన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఏ పొలంలో చూసినా ఎద్దు, ట్రాక్టర్ల సందడి కనిపిస్తోంది. ఆర్‌బీకేల ద్వారా ఇప్పటికే రైతులకు అవసరమైన వివిధ పంటల విత్తనాలు, ఎరువులు రాయితీతో అందజేశారు. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా పంటల సాగులో నిమగ్నమయ్యారు. గార్లదిన్నె, శింగనమల మండలాల్లో గురువారం విత్తనాలు వేస్తున్న దృశ్యం

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



వేరుసనగకు విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

నగర వ్యాప్తంగా అంతర్గత రోడ్ల అభివృద్ధి

● మేయర్ వసీం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరవాసులకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నగరంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని మేయర్ వసీం పేర్కొన్నారు. 18వ డివిజన్ గుల్జార్‌పేటలో రూ.20 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ గురువారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రధాన రోడ్లను సైతం అప్పటి పాలకులు విస్మరించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వెలుగు చూసిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ నిధులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు చేపట్టామన్నారు. రానున్న ఐదారు నెలల్లో పనులు పూర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, ఇస్సాక్, ఈఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి, నాయకులు దాదు, హబీబుల్లా, ఖాజా, గఫార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులూ నిత్య విద్యార్థులే



ప్రొఫెసర్ జీవీ రమణను అభినందిస్తున్న బీఈడీ విద్యార్థులు

అనంతపురం: ఉపాధ్యాయులూ నిత్య విద్యార్థులేనని ఎస్కేయూ ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య బీఈడీ 2020-22 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సభను జ్యోతిరావు పూలే భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లోకెల్లా ఉన్నతమైందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ప్రతి విద్యార్థిని ఉన్నతంగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో దూరవిద్య డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. మునినారాయణప్ప, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఆర్. సదాశివా రెడ్డి, అడ్‌హాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శకుంతల, డాక్టర్ అనిత, డాక్టర్ సంజీవ రాయుడు, డాక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

సహజీవనం చేసి ముఖం చాటేశాడు

● పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భార్య, పిల్లలు ఉన్నా ఓ వ్యక్తి ఓ మహిళను మాయమాటలతో లోబరుచుకొని సహజీవనం చేశాడు. ఆమె కష్టార్జితాన్ని కూడా దోచుకుని చివరకు ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు నాల్గవ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. రుద్రంపేటలో నివాసం ఉంటున్న రాధ వంటమనిషిగా పని చేస్తోంది. హరినాథ్ అనే వ్యక్తిని నమ్మి ఏడేళ్లుగా అతనితో సహజీవనం చేసింది. మాయమాటలు చెప్పిన హరినాథ్.. ఆమెతో రూ.15 లక్షలు నగదు, బంగారు నగలను తీసుకున్నాడు. చివరకు దేవుడి పటాల వద్ద ఉంచిన మొత్తాన్ని కూడా కాజేశాడు. అనంతరం ముఖం చాటేశాడు. అతను శింగనమలలో ఉన్నట్లు తెలుసుకొని వెళ్లగా అతనికి వివాహమైనట్లు తెలిసింది. తీసుకున్న నగదు వెనక్కు ఇవ్వాలని కోరగా హరితోపాటు అతని భార్య అంజలీ ఆమెను బెదిరించారు. దీంతో బాధితురాలు శింగనమల పోలీసులను ఆశ్రయించింది. అయితే కేసు వాపసు తీసుకోవాలని ఈనెల 6న హరి, అతని బంధువులు రాధాను బెదిరించారు. దీంతో రాధ నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

భక్తిశ్రద్ధలతో సాయిభక్తుల భిక్షాటన



సాయినాథుడి ఉత్సవమూర్తి



భిక్షాటన చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని గురువారం అనంత నగర వీధుల్లో సాయిభక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామచంద్రానగర్‌లోని సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో భక్తులు జోలె పట్టి బియ్యం, బేడలు సేకరించారు. బాబా ప్రతిమను ఊరేగిస్తున్నప్పుడు భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పిస్తూ భిక్షను సమర్పించారు. వచ్చేనెల 3న జరుగనున్న గురుపౌర్ణమి నాడు వేలాది మందికి అన్నదానం చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కనగానపల్లి: ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆణిముత్యాలు కార్యక్రమం అమలు చేస్తోందని మామిళ్లపల్లి కేఆర్ఆర్ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం స్నేహలత అన్నారు. టెన్త్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు వంశీ, సాయిలక్ష్మి, శరత్‌కుమార్‌కు ఆణిముత్యాలు కింద గురువారం నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. సర్పంచ్ ఓబిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శివయ్య, ఉపాధ్యాయులు నాగేంద్రరెడ్డి, రామచంద్ర, శివారెడ్డి, నాగరాజు, జయచంద్ర, పీఈటీ శివారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఏప్రిల్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ముగ్గురు విద్యార్థులు డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బీఎస్సీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. అనంతపురంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

గోమాతకు క్యాన్సర్.. శస్త్ర చికిత్సతో కన్ను తొలగింపు



బత్తలపల్లి: మూగజీవాలకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. టోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఒక్కఫోన్ చేస్తే చాలు పశువైద్యులు అంబులెన్స్‌ల్లో రైతుల ఇళ్లవద్దకే వచ్చి పశువులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో క్యాన్సర్ సోకిన ఆవుకు జిల్లా పశు వైద్యులు సకాలంలో శస్త్ర చికిత్స చేసి ప్రాణం పోశారు. వివరాలను గురువారం బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీ శ్రీనివాసులు వెల్లడించారు. బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి రైతు భరత్‌కు చెందిన ఆవు ఇటీవల అనారోగ్యానికి గురైంది. కన్ను పూర్తిగా మూసుకుపోయింది. దీంతో రైతు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడంతో పశువైద్యులు అంబులెన్స్‌లో గ్రామానికి వెళ్లారు. ఆవును పరీక్షించి కన్నుకు క్యాన్సర్ సోకినట్లు గుర్తించి, అంబులెన్స్‌లో ఆవును బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యురాలు దివ్య, కాంపౌండర్ సాయినాథ్ సహకారంతో ఏడీ శ్రీనివాసులు శస్త్రచికిత్స చేసి ఆవు కన్ను తొలగించారు. అవసరమైన మందులు అందజేసి 5 రోజుల పాటు ఆవును జాగ్రత్తగా చూసుకోవాలని రైతుకు సూచించారు. మళ్లీ అదే అంబులెన్స్‌లోనే ఆవును రైతు ఇంటి వద్దకు చేర్చారు. క్యాన్సర్‌తో ఆవు పడుతున్న బాధకు ఉపశమనం కలిగించిన పశువైద్యులను రైతులు అభినందించారు. ఇంటివద్దకే పశువైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్న సీఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



శస్త్రచికిత్స చేసిన ఏడీ శ్రీనివాసులు, డాక్టర్ దివ్య

వైద్య విద్యార్థులకు యోగా



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వైద్య విద్యార్థులు. చిత్రంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాలలో 2కే-22 బ్యాచ్ వైద్య విద్యార్థులకు గురువారం యోగా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రముఖ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ హరిప్రసాద్ హాజరై యోగా, ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఫిజియాలజి ప్రొఫెసర్ డాక్టర్ సరళ, చిన్న పిల్లల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ కౌసల్యకు గోసేవా మహానంది అవార్డు



దేవరకొండ కౌసల్య

అనంతపురం కల్చరల్: గో సేవ కోసం విశేష కృషి చేస్తున్న అనంతపురం నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త దేవరకొండ కౌసల్యను గోసేవా మహానంది అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు తెలుగు సాహితీవేదిక సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న గుంటూరులోని పోలేరమ్మ దేవస్థాన కళాప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఆమెకు పురస్కారం అందజేసి సత్కరిస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన కౌసల్యను స్వామి ఆత్మవిదానంద సరస్వతి, గోసేవకులు రమేష్ భరద్వాజ్ అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతుడు కుమారస్వామి

గుత్తి: తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి చిన్న కుమారుడు కుమారస్వామి(16) ఇటీవలే పదవ తరగతి పాసయ్యాడు. దీంతో కుమార స్వామిని విజయవాడలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో చేర్పించారు. అయితే కాలేజీకి వెళ్లకుండా కుమారస్వామి ఇంటి వద్దే ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం తన కుమారుడిని కాలేజీకి వెళ్లాలని చెప్పినా నిరాకరించడంతో అతడిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం కుమారస్వామి పుట్టిన రోజు. పుట్టిన రోజును ఎంతో ఘనంగా జరపాలని కుటుంబ సభ్యులు ఎంతో ఆశపడ్డారు. ఉన్న ఫళంగా కుమారస్వామి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

గ్రూప్-1 పోస్టులు పెంచాలి

అనంతపురం అర్బన్: గ్రూప్-1 పోస్టులు పెంచడంతోపాటు మెగా డీఎస్సీ నిర్వహించాలని ఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు కోరారు. జిల్లాకు విచ్చేసిన ఆయన గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 4,785 అసిస్టెంట్ అనిమల్ హజ్బెండరీ (ఏహెచ్ఏ) పోస్టులను భర్తీ చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు గుంటూరు విజ్ఞాన మందిరంలో సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. నాయకులు మోహన్‌కృష్ణ, ధనుంజయ, శ్రీనివాస్, లిఖిల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి: మండల తహసీల్దార్‌గా కె, రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీ.వీ. రమణ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో కర్నూలు జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన రమాదేవి ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.డీటీ ప్రసాద్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

వనాల అభివృద్ధికి భూమిని కేటాయించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: నగర వనాల అభివృద్ధికి అవసరమైన భూమిని కేటాయించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో నగర వనాల అభివృద్ధికి భూమిని కేటాయించాలని ఆర్‌డీఓలను ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ ఫైళ్లకు సంబంధించి ఏవైనా సమస్య ఉంటే పరిష్కరించి డీఎల్‌సీ సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఎఫ్ఓ సందీప్‌కుపాకర్, ఆర్‌డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, రవీంద్ర, ఫారెస్ట్ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

'వడ్డీ లేకుండా పన్ను చెల్లించండి'

అనంతపురం క్రైం: 2023-24 మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నును వడ్డీ లేకుండా చెల్లించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందని కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం 8 రోజులు మాత్రమే గడువుందని, ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ, పురసేవ యాప్, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో క్రెడిట్, డెబిట్, బ్యాకింగ్ యూపీఐ ద్వారా చెల్లించే సదుపాయాన్ని కల్పించామని తెలిపారు.

చురుగ్గా మరుగుదొడ్ల మరమ్మతులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో రూ.10 లక్షలతో చేపట్టిన మరుగుదొడ్ల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జెడ్పీ కార్యాలయం పై అంతస్తులో ఉన్న మరుగుదొడ్లతో పాటు కింది భాగంలో మరుగుదొడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులు లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మహిళా ఉద్యోగినులతో పాటు వివిధ పనులపై వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురయ్యేవారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ స్పందించారు. ఉద్యోగులతో పాటు కార్యాలయ పనులపై వచ్చే ప్రజాప్రతినిధులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించడంతో పనులు వేగంగా సాగుతున్నాయి.

పెద్దమ్మ ఆలయానికి విరాళం



రూ.లక్ష మొత్తాన్ని అందజేస్తున్న ఆదినారాయణ

రాప్తాడు: మరూరులోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయానికి జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఆమె భర్త, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ పసుపుల కదిరప్ప రూ.లక్ష విరాళం ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామికి ఆ గురువారం ఆ మొత్తాన్ని అందజేశారు.

24, 25 తేదీల్లో కథాకేళి పోటీలు

అనంతపురం కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభల సందర్భంగా ఈనెల 24, 25 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రవాసాంధ్రుల పిల్లలకు కథలు చెప్పేందుకు కథాకేళి పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు తానా సమన్వయకర్త వీర్నపు చిన సత్యం గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీలకు నమూనాగా 100 చిట్టి కథలను ఆన్‌లైన్‌లో పెట్టామన్నారు. పోటీల్లో పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా జిల్లాకు చెందిన రచయిత్రి నల్లాని రాజేశ్వరిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ప్రథమ ర్యాంకర్‌కు సన్మానం



మొగల్ షిమా సాలెహను సన్మానిస్తున్న మేయర్ వసీమ్

అనంతపురం క్రైం: డీసెట్ ఉర్దూలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన నగరానికి చెందిన మొగల్ షిమా సాలెహను నగర మేయర్ వసీమ్ గురువారం నగరపాలక సంస్థలో సన్మానించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన మొగల్ షిమా సాలెహ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం జిల్లాకే గర్వకారణమని మేయర్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, ఇసాక్, కమల్ భూషణ్ పాల్గొన్నారు.